
# అతడు-ఆమె

పేరూరు బాలసుబ్రమణ్యం

**వెండి వెన్నెల. సాయంత్రపు చలిపులి. రేణిగుంట రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌పై అడుగుపెట్టాడు చరణ్. వాచ్‌కేసి చూసుకున్నాడు. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ తిరుపతి నుంచి రావడానికి ఇంకా అరగంట టైముంది అనుకుని అక్కడున్న చప్టాపై కూర్చున్నాడు.**

**చల్లగాలి రివ్వున చెవుల్లోకి దూసుకెళుతోంది. జేబులో నుంచి ఓ సిగరెట్ తీసి వెలిగించాడు.**



ప్లాట్‌ఫామ్‌పై అటు ఇటుగా చూశాడు. కొంచెం దూరంలో వున్న బుక్‌స్టాల్ వద్దకి మెల్లగా నడుచుకుంటూ వెళ్ళాడు.

''వెన్నెల్లో అమ్మాయి ఉందా?'' అడిగాడు చరణ్.

''లేదండీ! ఉన్న ఒకే ఒక వెన్నెల్లో అమ్మాయిని, ఆ పిల్ల తీసుకుని వెళుతోంది'' అని ఆ నవల తీసుకెళుతున్న యువతిని చూపించాడు బుక్‌స్టాల్‌లోని వ్యక్తి.

చరణ్ అటు తిరిగి కళ్ళను ఆమెవైపు జూమ్ చేశాడు.

నిజంగా పాలరాతి శిల్పానికి ప్రాణం పోసినట్లుంది. ధరించిన మిల్క్‌వైట్ చుడీదార్ ఆ అందానికి మరింత వన్నె తెస్తోంది.

ఆమెను సమీపించి ''హలోః! మేడమ్'' అన్నాడు చరణ్.

అమ్మాయి వెనక్కు తిరిగింది.

ఆమె అందాన్ని అంత దగ్గరగా చూడగానే చరణ్‌కు మతిపోయినట్లనిపించింది.

'అబ్బః! చెంపలకు తగ్గట్టు చారడేసి కళ్ళు!' మనసులోనే అనుకున్నాడు చరణ్.

''ఏమిటండీ?'' చాలా క్యాజువల్‌గా, అడిగింది ఆ యువతి.

''కోయిల కూడా మాట్లాడుతుందా?'' ఈసారి మనసులో మాట బయటికే అనేశాడు చరణ్.

''హలో సార్! ఎవరు మీరు? మీలో మీరు అలా గొణుక్కుంటున్నారేంటి? ఇంతకీ మీకెవరు కావాలి?'' ప్రశ్నల బాణాలను చరణ్‌పై సంధించిందా ముగ్ధమనోహరి.

అందమే కాదు ధైర్యం, తెగువ కూడా వున్నాయనుకుని ఆమె చొరవకు కొంచెం జంకాడు.

''ఆః...! అది. అది మీ వెన్నెల్లో అమ్మాయి నవలని నాకిస్తారా!'' ధైర్యం తెచ్చుకుని అడిగాడు.

చరణ్‌ని సూటిగా ఓ చూపు చూసేసి ''సారీ'' అనేసి చకచకా వెళ్ళిపోయింది.


చేసేదేమీ లేక అక్కడున్న ఓ చెక్కబల్లపై కూర్చుని ఆమె వెళ్ళినవైపే చూస్తుండిపోయాడు చరణ్. అతనో గాయకుడు.

వెన్నెల చల్లదనాన్ని, సెలయేటి గలగలల్ని, మధుమాస మధురిమల్ని, మత్తుగా కూసే కోయిల పాటని, ఉగాది సరిగమల్ని, సంక్రాంతి సంబరాలను మధురంగా పాడి శ్రోతను మంత్రముగ్ధుల్ని చేస్తాడు.

నేడు ఫాస్ట్ జనరేషన్ ముసుగులో, స్పీడ్ యుగం అనే నెపంతో మనం పోగొట్టుకుంటున్నది ఏమిటో ఈ లోకానికి తెలియజెప్పాలనీ, ప్రకృతి అందాలను ఆస్వాదించాలనీ, ప్రేమానురాగాలు, మానవ సంబంధాలు ఎప్పటికీ ఆర్థిక సంబంధాలు కాకూడదనే భావాలతో పాటలు రాస్తాడు.

చరణ్‌ను హైదరాబాదు రవీంద్రభారతిలో జరిగే 'సంక్రాంతి సంబరాలు' వేడుకలో కృష్ణశాస్త్రి గేయాలను పాడటానికి ప్రత్యేకంగా ఆహ్వానించారు.

నిర్వాహకులు ఫ్లైట్ టికెట్స్ పంపుతామంటే చరణ్ వద్దన్నాడు. రైల్లో సెకండ్ క్లాస్‌లో




ప్రయాణం చేయడమంటే చాలా ఇష్టం. కిటికీ పక్క కూర్చుని కదిలే రైలులోనుంచి ప్రకృతిని చూసి ఆస్వాదించడమంటే మరీ ఇష్టం. ఏవో మాటలు వినిపిస్తే తల తిప్పాడు.

కొంచెం దూరంలో నలుగురు యువకులు, ఇదివరకు తను నవల అడిగిన యువతిని చుట్టు ముట్టి ఆటపట్టిస్తున్నారు.

ఆమె చేతిలో పుస్తకం చూసి ''వెన్నెల్లో అమ్మాయిరోయ్'' అని అన్నాడొకడు.

''చీకట్లోకొస్తుందేమో అడగరా?'' అన్నాడు మరొకడు.

అలా రకరకాలుగా కామెంట్ చేస్తున్నారు.

చరణ్‌కి కోపమొస్తోంది. తన సొంత మనిషినో, ప్రియురాలినో కామెంట్ చేస్తున్నట్లు ఫీలవుతున్నాడు. వారికి అడ్డుపడాలనీ, నాలుగు తగిలించాలనీ లేచాడు. అంతలో రైలు కూత వినిపించింది.

అప్పటిదాకా రైలుకోసం ప్లాట్‌ఫామ్‌పై ఎదురు చూస్తున్న ప్రయాణీకులు బోగీ ఎక్కడొచ్చి ఆగుతుందో... బెర్త్ ఎక్కడుందో వెతుక్కోవడానికి అలర్ట్ అయ్యారు.

రైలు కీచుమని శబ్దం చేస్తూ వచ్చి ఆగింది. అందరూ వారి వారి బోగీలోకి వెళ్తున్నారు.

చరణ్ ఆ కోతిమూకకోసం చూశాడు. లేరు. ఆమె కూడా లేదు. ''ప్చ్...!'' అని నిట్టూర్చి రైలెక్కి తన బెర్త్‌లో కూర్చున్నాడు. కాసేపు తర్వాత తల పైకెత్తి ఎదురుగా చూసి ఆశ్చర్యపోయాడు.

ఆ అందాల బొమ్మ కిటికీ వద్ద ఎదురుగా కూర్చుని వుంది.

అమావాస్య చీకటిలో హఠాత్తుగా నిండుచంద్రుడు ప్రత్యక్షమైతే ఎలా వుంటుందో, నల్లని ఒత్తయిన కురుల మధ్య ఆమె ముఖారవిందాన్ని చూడగానే అలా అనిపిస్తోంది. పెళ్ళి చేసుకుంటే ఇలాంటి అమ్మాయినే చేసుకోవాలనిపించింది.

'ఛీ! ఏ స్టేషన్‌లో రైలు దిగుతుందో కూడా తెలియని ఈ అమ్మాయిని నేనెలా పెళ్ళి చేసుకోగలను' అనుకున్నాడు చరణ్. రైలు వేగంగా వెళుతోంది.

అలా పిచ్చిపిచ్చిగా ఆలోచిస్తున్న చరణ్‌కి అంతకుముందు ప్లాట్‌ఫారమ్‌పై అల్లరి చేసిన యువకుల అరుపులు వినబడి ఈ లోకంలోకి వచ్చాడు.

వాళ్ళే! ఆ నలుగురే! ఆమె పక్క కూర్చుని మళ్ళీ కామెంట్ చేస్తున్నారు.

చరణ్ రక్తం ఉడికిపోతోంది. వారిని మందలించాలని, వినకపోతే గొడవకు దిగాలని ఆవేశంగా నోరు తెరవబోయాడు. కానీ ఎందుకో కాలు ముందుకు పడలేదు.

రైలు కడప స్టేషన్‌లో ఆగింది. ప్రయాణీకుతో ప్లాట్‌ఫారమ్ కిటకిటలాడుతోంది. అదే సమయంలో ఎవరో ఒక యువకుడు రైలెక్కి ఆమె దగ్గరకు వచ్చి నవ్వుతూ పేరుపెట్టి పలకరించి పక్కన కూర్చున్నాడు.

అతడ్ని చూడగానే అంతవరకు ఆమె ముఖంలో వున్న బాధంతా మంచు తెరల్లా కరిగిపోయింది. ఆమె ముఖంలో ఆ ఆనందం చూడగానే చరణ్ మనసు కూడా ఆనందంతో నిండిపోయింది. అయితే అతనిలో ఎందుకో అసూయ.

అతనెవరై వుంటాడు?

ఆమె, అతను పక్కపక్కన కూర్చుని ఏవేవో కబుర్లు... ఒకటే నవ్వు... అతను ఆమెను 'మృదుల' అని, ఆమె అతన్ని 'నాగ్' అని సంబోధించుకోవడం, మాటలు ముదిరి పాకానపడేకొద్దీ 'ఒరే!' అని కూడా పిలుచుకోవడం మొదలుపెట్టారు.

వారిద్దరి ఒద్దికను చూసిన పోకిరీలు జారుకున్నారు.

తర్వాత వారి బెడద తొలగిందని ఆమె బ్యాగ్ నుంచి పేకముక్కలు బయటకు తీసింది. అతను తీసుకుని కలిపి పంచాడు. ఇద్దరూ పేకాటలో మునిగిపోయారు.

అతను, ఆమెతో అంత దగ్గరగా కూర్చోవడం అపుడపుడు తాకడం, జోకులేయడం, నవ్వుకోవడం చూస్తుంటే చరణ్‌కి మనసొప్పడం లేదు. అతన్ని చూస్తుంటే మరీ అసూయగా వుంది. ఆమె అతనితో అంత చనువుగా వుండడం చూస్తుంటే చరణ్ మనస్సు చివుక్కుమంది. ఆమెపై ఇదివరకున్న జాలిపోయి కోపం పుట్టుకొచ్చింది.

ఇక వారిద్దర్నీ చూడలేక కళ్ళు మూసుకున్నాడు. అయినా వారి నవ్వులు, మాటలు, పేకాట కళ్ళముందే మెదుతున్నాయి. అలాగే ఎపుడో నిద్ర పట్టేసింది చరణ్‌కి.

ఉదయం ఎనిమిదైంది.

ఎవరో మెల్లగా తట్టి నిద్ర లేపారు. లేచి చూస్తే హైదరాబాద్, కాచిగూడ రైల్వేస్టేషన్.

''సార్! నేను రంగయ్యను! దిగండి సార్! రాత్రి బాగా నిద్రపోయినట్టున్నారు'' అంటూ చరణ్ గేజ్‌ని అందుకుని దిగాడు ఈ ప్రోగ్రామ్ ఇన్‌ఛార్జి పంపిన కారు డ్రైవర్ రంగయ్య.

హైదరాబాదులో ఏ ప్రోగ్రామ్ జరిగినా చరణ్‌ని కారులో తీసుకెళ్ళేది రంగయ్యే. చరణ్ కారు వద్దకొచ్చి డోర్ ఓపెన్ చేశాడు. కారులో వాళ్ళిద్దరూ కూర్చుని వున్నారు.

చరణ్‌కి పట్టరాని కోపమొచ్చింది. పైకి ఏమీ అనలేక అలాగే వారిని, రంగయ్యను మార్చిమార్చి చూడసాగాడు.

''ఏంటి సార్! వారిని చూసి అలా ఆశ్చర్యపోతున్నారు. ఎక్కండి సార్! ఈమె పేరు మృదుల. మీలాగే సింగర్. ఇతను మృదుల అన్నయ్య నాగరాజు. మన ప్రోగ్రామ్‌లో పాడటానికే మృదుల గారు కూడా వస్తున్నారు.''

చరణ్‌కి ఒక్కసారిగా మతిపోయినంత పనైంది. మౌనంగా బొమ్మలా కారెక్కి కూర్చున్నాడు.

''మృదులమ్మా! ఈయన చరణ్‌గారు. కవి, గాయకుడు'' అంటూ పరిచయం చేశాడు.

''మా చెల్లెలికి మీ పాటంటే ప్రాణం సార్! అలాంటిది ఇపుడు ఏకంగా మీతో కలిసి పాడే అవకాశం కలిగినందుకు మృదుల ఎంత ఆనందపడుతోందో చూడండి'' అన్నాడు నాగరాజు.

చరణ్ మృదుల వైపు చూశాడు. ఆమె మొహంలో ఆనందం.

''మరి మీరు కడపలో ఎక్కారు కదా!'' నాగరాజును అడిగాడు చరణ్.

''నేను కడపలో ఉద్యోగం చేస్తున్నాను సార్! డ్యూటీ అయిపోగానే రెడీ అయి అక్కడ్నుంచి మా చెల్లెలితో కలుసుకోవడానికి ముందే ప్రోగ్రామ్ ప్లాన్ చేసుకున్నాం'' వివరంగా చెప్పాడు.

రాత్రి వారిద్దర్నీ చూసి జెలసీ ఫీలైనందుకు సిగ్గుపడ్డాడు చరణ్.

కుటుంబ బంధాలు, అనుబంధాలు గురించి ఎంతో గొప్పగా లోకానికి పాడి వినిపించే తానూ, తన ఆలోచనా విధానం కూడా ఈ సమాజానికి ఏమీ తీసిపోలేదు. పదిమందికి చెప్పడం కాదు. మొదట మన ఆలోచనా తీరు మార్చుకోవాలి అని మనసులోనే బాధపడ్డాడు చరణ్.

★